క్లుప్తంగా

వివరాలు నమోదు చేసుకోవాలి

పాలకొండ రూరల్: అన్నదాత సుఖీభవతో పాటు పీఎం కిసాన్ యోజన పథకాలను పొందేందుకు రైతులు మండలంలోని సింగన్నవలస సచివాలయాన్ని సంప్రదించి వివరాలు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎన్ని వాహని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భూమికి సంబంధించిన వన్‌బీ నకలు, ఆధార్, ఆధార్ లింక్ చేయబడిన ఫోన్ నంబర్ తీసుకువచ్చి వివరాలు నమోదు చేసుకుంటే.. అర్హత గల రైతులకు మూడు విడతల్లో రూ. 20 వేల పెట్టుబడి సాయం అందుతుందని చెప్పారు. ఈ అవకాశాన్ని అన్నదాతలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

● రూరల్ ఏఈ పి.రామారావు

పార్వతీపురం రూరల్: మండలంలోని నర్సిపురం సబ్‌స్టేషన్ పరిధిలో 11కేవీ ఫీడర్ పరిధిలో విద్యుత్ తీగలకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు ప్రక్రియ, మెయింటెనెన్స్ పనుల్లో భాగంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు నర్సిపురం గ్రామంతో పాటు వసుంధరనగర్, వైకేఎం కాలనీ, ఓలేటి ఫారం, వెంకంపేట గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు పార్వతీపురం మండల విద్యుత్‌శాఖ ఏఈ రామారావు తెలిపారు. ఈ మేరకు వినియోగదారులు సహకరించాలని కోరారు.

కుట్టుమిషన్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

గుమ్మలక్ష్మీపురం: మహిళలకు ఇస్తున్న కుట్టుమిషన్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి కోరారు. మండల కేంద్రంలోని వైటీసీ(యూత్ ట్రైనింగ్ సెంటర్)లో ఏపీ బీసీ సహకార ఆర్థిక సంస్థ(శ్రీ టెక్నాలజీ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బీసీ కార్పొరేషన్ టైలరింగ్(కుట్టుమిషన్) శిక్షణను ఆమె గురువారం ప్రారంభించారు. 90 రోజుల పాటు ఇచ్చే ఈ శిక్షణను పూర్తి చేసుకున్న తర్వాత స్వయం ఉపాధి పొందడం ద్వారా ఆర్థిక ఇబ్బందులు తొలగుతాయని ఎమ్మెల్యే తెలిపారు. శ్రీటెక్నాలజీ సమన్వయకర్త గుల్ల రాజేష్ మాట్లాడుతూ కోర్సు పూర్తయిన తర్వాత ఉచితంగా కుట్టుమిషన్లు పొందాలంటే కనీసం 75 శాతం హాజరు శిక్షణా కాలంలో కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.సాల్మన్‌రాజు, ఏఎంసీ చైర్మన్ కె.కళావతి తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో సామూహిక హారతి



సంగంవలసలో నగర సంకీర్తనలో రామభక్తులు

పార్వతీపురం రూరల్: మండలంలోని సంగంవలస గ్రామంలో రామమందిరం వద్ద భక్తులు గురువారం సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించి సామూహిక హారతి ఇచ్చారు. గురువారం వైశాఖ శుద్ధ ఏకాదశి సందర్భంగా శ్రీరామ భజనమండలి సభ్యుల ఆధ్వర్యంలో వేకువ జామున సంగంవలస గ్రామ పురవీధుల్లో జైశ్రీరామ్ నామాన్ని స్మరిస్తూ నగర సంకీర్తన నిర్వహించి భక్తుల్లో ఆధ్యాత్మిక భావాన్ని పెంపొందించారు. భక్తులకు అర్చకులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

లక్ష్మీనృసింహ స్వామికి ప్రత్యేకాలంకరణ



ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చిన లక్ష్మీనృసింహస్వామి

సీతానగరం: స్థానిక వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న లక్ష్మీనృసింహ స్వామిని గురువారం ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులతో ముడుపుల పూజలు ఈ సందర్భంగా ఘనంగా జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీనివాసాచార్యులు పర్యవేక్షణలో అర్చక బృందం నిర్వహిస్తున్న ముడుపుల పూజల్లో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి పాల్గొంటున్నారు. స్వామి వారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు ఆలయ ప్రాంగణంలో క్యూలో నిలబడి కార్యక్రమాల్లో పాల్గొన్నారని అర్చకుడు శ్రీనివాసాచార్యులు తెలియజేశారు.

తొలగని ముసుగు

సాలూరు రూరల్: ఎన్నికల కోడ్ ప్రకటించగానే ఫ్లెక్సీలు, నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయడం ఎన్నికల కోడ్. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే ముసుగులు తొలగిస్తారు. అయితే సాలూరు మండల అధికారులు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారనే చెప్పవచ్చు. మండలంలోని తోణాం గ్రామంలో ఉన్న దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి వేసిన ముసుగులను ఎన్నికలు పూర్తయి నెలలు గడుస్తున్నప్పటికీ ఇప్పటికీ తొలగించలేదు. ఇప్పటికైనా నేతల విగ్రహాలపై ముసుగులు తొలగించాలని పలువురు కోరుతున్నారు.

డంపింగ్‌యార్డుతో ఇబ్బందులు



చెత్త నుంచి వచ్చే మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పాలకొండ: పాలకొండ నగర పంచాయతీ డంపింగ్ యార్డుతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెండు నెలల్లోనే డంపింగ్ యార్డు సమస్య పరిష్కారిస్తామని హామీ ఇచ్చినా ఇంతవరకు ఎటువంటి పురోగతి లేదు. తాత్కాలింగ్ ఓని గ్రామానికి వెళ్లే రహదారిలోని చెరువులో కొంతకాలంగా నగర పంచాయతీ చెత్తను వేస్తున్నారు. అప్పటిలో కొద్ది రోజులు ఇక్కడ చెత్తను వేసి, తర్వాత వేరే ప్రాంతానికి మారుస్తామని అధికారులు ఓని పరిసర గ్రామాల ప్రజలకు ఒప్పించారు. ప్రస్తుతం చెరువులో వేసిన చెత్త వేల టన్నులకు పెరిగిపోయింది. బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఈ చెత్తకు నిప్పు పెట్టారు. దీంతో అర్ధరాత్రి సమయంలో విపరీతమైన పొగ కమ్మేయడంతో ఓని, లుంబూరు, గరుగుబల్లి, జగనన్న కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారు. సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది గురువారం ఉదయం నుంచి మంటలను ఆర్పేందుకు శ్రమించారు. దీనిపై వైస్ ఎంపీపీ కనపాక సూర్యప్రకావరావు, లుంబూరు సర్పంచ్ తిర్లంగి ఉపేంద్రకుమార్‌లతో పాటు ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు నగరపంచాయతీ కమిషనర్‌ను కలసి పరిస్థితి వివరించారు. రెండు నెలల పాటు మాత్రమే చెత్త వేస్తామని మాట ఇచ్చారని.. ప్రస్తుతం ఏడాది గడుస్తున్నా డంపింగ్‌యార్డు తరలించలేదని తెలిపారు. యార్డు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

● అంగరంగ వైభవంగా...



పాలకొండ నగర పంచాయతీ కోమిటి పేటలో కొలువైన అన్నపూర్ణ సహిత సనారీ విశ్వేశ్వరనాథ అవదూత ఆలయంలో స్వామి వారి వార్షిక కల్యాణం గురువారం ఘనంగా నిర్వహించారు. భక్తులు, మహిళలు సంప్రదాయ పద్ధతితో సారె సమర్పించారు. అనంతరం అమ్మవారిని పెళ్లి కూతురుగా అలంకరించి వివాహ మంటపంలో కొలువుదీర్చారు. వేద మంత్రోచ్చారణల నడుమ స్వామివారి కల్యాణాన్ని అర్చకుడు ప్రసాద్ పాడి నేతృత్వంలో వైభవంగా చేపట్టారు. స్థానిక విశ్వబ్రాహ్మణ సంఘ అధ్యక్షుడు టీకి ప్రసాదరావు, స్వర్ణకార సంఘ సభ్యులు, భక్తుల సహకారంతో మహా అన్న సమారాధన కార్యక్రమం చేపట్టారు.

– పాలకొండ రూరల్

గ్రామంలో సమస్యలు తిష్ట వేశాయి..



మాజీ ఎమ్మెల్యే కళావతికి తమ సమస్యలు విన్నవిస్తున్న మూలలంక గ్రామస్తులు

వీరఘట్టం: కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత గ్రామంలో సమస్యలు తిష్ట వేశాయని మూలలంక గిరిజనులు ఆరోపించారు. ఈ మేరకు మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి వద్ద తమ గోడు వెల్లబోసుకున్నారు. గురువారం అటుగా వెళ్తున్న మాజీ ఎమ్మెల్యేను చూసిన స్థానికులు ఆమె కారును ఆపి సమస్యలు వివరించారు. మూలలంక - నర్సిపురం లింక్ రోడ్డు పనుల గురించి ఎవ్వరిని అడిగినా స్పందించడం లేదని వీరంతా కళావతికి తెలిపారు. సర్పంచ్ ఆరిక కమల, తదితరులు మాజీ ఎమ్మెల్యే కళావతిని కలిసిన వారిలో ఉన్నారు.

● టీడీపీ రంగుల పిచ్చి పీక్స్‌కు..



అధికార టీడీపీ రంగుల పిచ్చి పీక్స్‌కు చేరింది. భవనాలు, ప్రహరీలు, ఆఖరికి మరుగుదొడ్లను కూడా వదలడం లేదు. ప్రతిదానికీ పసుపురంగు పూసేయడమే. గరుగుబిల్లి మండల కేంద్రంలోని బీసీ విద్యార్థుల వసతిగృహానికి ఇటీవల ఎన్‌ఆర్‌ఈజీఎస్(జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం) నిధులతో ఏర్పాటు చేసిన గేటుకు కూడా ఆ పార్టీ రంగు పులిమేశారు. ఇది చూసిన వారంతా వారి పార్టీ కార్యాలయానికి వేసుకోవాల్సిన రంగు.. ప్రభుత్వ భవనాలకు ఎందుకని ప్రశ్నిస్తున్నారు.

–గరుగుబిల్లి

ఖాళీ జాగా కబ్జాకు యత్నం

● జనసేన కార్యకర్తను అడ్డుకున్న దళిత సంఘాలు



పీకేసిన హ్యాండ్‌బోరు హెడ్

భామిని: మండలంలోని బాలేరు ఎస్సీ కాలనీలో ఖాళీగా ఉన్న స్థలాలను జనసేన కార్యకర్తగా చెప్పుకునే ఓ వ్యక్తి జేసీబీతో లెవిల్ చేస్తుండగా.. గురువారం స్థానిక దళిత కాలనీవాసులు అడ్డుకున్నారు. ఈ భూమిని చదును చేసే క్రమంలో తాగునీటి బోరును సైతం పెకిలించేశారు. విషయం తెలుసుకున్న కాలనీవాసులు కబ్జాను అడ్డుకోవడంతో పాటు స్థానిక సచివాలయం వద్ద ఆందోళన చేపట్టారు. కబ్జా చేస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

దేశ చరిత్ర మార్గదర్శకం



శిబిరంలో తర్ఫీదు పొందుతున్న విద్యార్థులు

పాలకొండ రూరల్: దేశ చరిత్ర మార్గదర్శకమని స్థానిక శాఖా గ్రంథాలయ అధికారి బి.గణేష్‌బాబు అన్నారు. గురువారం స్థానిక గ్రంథాలయ శిక్షణ శిబిరంలో విద్యార్థులకు దేశ, రాజరికపు వ్యవస్థ, నాయకులు, మార్గదర్శకుల చరిత్రపై అవగాహన కల్పించారు. అనంతరం తంపటాపల్లి డ్రాయింగ్ ఉపాధ్యాయుడు జి.మురళి షాడో చిత్రలేఖనంపై తర్ఫీదు ఇచ్చారు. విశ్రాంత ఉపాధ్యాయులు ఎం.వెంకటరమణ, బి.వాసు, తదితరులు సహకరించారు.

తారెత్తిస్తున్న ఎండలు

పగటి ఉష్ణోగ్రతలు తీవ్రస్థాయికి చేరుకోవడంతో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వడగాడ్పులతో కూడిన ఎండలకు బయటకు రావాలంటేనే హడలిపోతున్నారు. గురువారం 40 డిగ్రీలకు పైబడి ఉష్ణోగ్రత నమోదు కావడంతో ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా మారాయి. నిత్యం రద్దీగా ఉండే ప్రధాన రహదారులతో పాటు గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రహదారులు, నగర పంచాయతీ వీధులు నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి. ఉపాధి పనులకు వెళ్లే వేతనదారులు తలపై కొంగులు కప్పుకుంటూ రాకపోకలు సాగించారు. ఎండలు అధికంగా ఉండడంతో వడదెబ్బ తగిలే అవకాశం ఉన్నందున, అప్రమత్తంగా ఉండాలని ఫైర్ ఆఫీసర్ జామి సర్వేశ్వరరావు సూచించారు.

–పాలకొండ రూరల్



ఎండలో వస్తున్న ఉపాధి వేతనదారులు

వీధిదీపాలు ఏర్పాటు

గుమ్మలక్ష్మీపురం: స్థానిక వీధుల్లోని విద్యుత్‌స్తంభాలకు వీధిదీపాలు గురువారం ఏర్పాటు చేశారు. పాడైన బల్బుల స్థానంలో కొత్తవాటిని అమర్చారు. కొండవీధి, చింతలగూడ వీధి, రామాలయం వారి వీధి, అమ్మవారి గుడి తదితర ప్రాంతాల్లో జరిగిన ఈ పనులను సర్పంచ్ బి.గౌరీశంకరరావు పరిశీలించారు. ఈ నెల 12న గ్రామదేవత ఉత్సవాలు ఉండనుండడంతో గ్రామస్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా విద్యుత్ లైట్లు వేయించడం జరిగిందన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పాలకొండ రూరల్: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు సరఫరా ఉండదని ఏపీ ఈపీడీసీఎల్ ఈఈ టీకేజీ గురుమూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఇందిరానగర్ కాలనీ, వడమ కొత్త కాలనీ, వడమ, మున్సిపల్ కార్యాలయ పరిసరాలతో పాటు గారమ్మకాలనీ, రాజాం రోడ్డు, గజాలా ఖానా నుంచి మండలంలో తుమరాడ గ్రామం వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు. అలాగే 11 కేవీ వీరఘట్టం లైన్ పరిధిలో యరకారాయపురం, గొట్ట, చిన మంగళాపురం గ్రామాలు, తంపటాపల్లి, బక్కూరు, రాజుపేట, పద్మాపరరం, ఎల్ఎల్.పురం, చిన కోటిపల్లి గ్రామాలకు సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

కోనేటి అభివృద్ధికి చర్యలు



కోనేటి అభివృద్ధిపై సూచనలు చేస్తున్న సుడా చైర్మన్, ఎమ్మెల్యే, తదితరులు

సాక్షి ఎఫెక్ట్...

పాలకొండ రూరల్: పాలకొండ గోదా రమ్మగా పేరుగాంచిన వెంకటరాయుని కోనేటి అభివృద్ధికి చర్యలు చేపడతామని ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా అర్బన్ డవలప్‌మెంట్ చైర్మన్ కొరికాన రవికుమార్ అన్నారు. గురువారం సాక్షిలో ప్రచురితమైన 'రూపు కోల్పోతున్న కోనేరు' కథనంపై ఆయన స్పందించారు. నియోకవర్గ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణతో కలసి కోనేటి పరిసరాలను పరిశీలించారు. కోనేటి అభివృద్ధికి అవసరమగు చర్యలు చేపట్టాలని సుడా ప్లానింగ్ అధికారి అమర్‌నాథ్, సీనియర్ ఇంజినీర్ సుగుణాకర్‌లకు సూచించారు. ఈయన వెంట కూటమి నాయకులతో పాటు నగర కమిషనర్ రత్నరాజు, తదితరులు పాల్గొన్నారు.

పండగను ఘనంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న సీఐ అప్పలనాయుడు

సాలూరు: శ్యామలాంబ పండుగ సమయంలో ప్రజలందరూ శాంతిభద్రతలకు సహకరిస్తూ, పండగను ఘనంగా జరుపుకోవాలని పట్టణ సీఐ అప్పలనాయుడు అన్నారు. ఈ మేరకు గురువారం పట్ట ణంలోని డబ్బివీధి, వడ్డివీధి తదితర ప్రాంతాల్లో ఆయన ప్రజలతో మాట్లాడారు. పండగ సమయంలో శాంతిభద్రతలు, ట్రాఫిక్ తదితర నియమాల గురించి వివరించారు. సిరిమాను, తొలేళ్ల ఉత్సవంలో శాఖాపరమైన అంశాలపై ప్రజలకు సూచనలు జారీ చేశారు. అందరి సహకారంతో పండగను ఘనంగా జరుపుకోవాలని కోరారు. అనంతరం కరపత్రాలను విడుదల చేశారు.

భూ వివాదం పరిష్కారానికి చర్యలు

సీతంపేట: మండలంలోని బిల్లమడ ప్రాంతంలో నెలకొన్న జిరాయితీ భూ వివాదం పరిష్కారానికి చర్యలు తీసుకున్నట్లు తహసీల్దార్ అప్పలరాజు తెలిపారు. ఈ మేరకు పోలీసులు, రెవెన్యూ సిబ్బంది భూమి వద్దకు వెళ్లి గురువారం హద్దురాళ్లు వేశారు. వివరాల్లోకి వెళితే.. వెంకటపతిరాజు, ఆయన కుటుంబ సభ్యులకు 107 ఎకరాల జిరాయితీ సాగు భూమి ఉంది. దీనిలో బిల్లమడ గ్రామ పరిధిలో ఉన్న గిరిజనులకు 50 ఎకరాల వరకు ఉచితంగా మూడేళ్ల కిందట వెంకటపతిరాజు పంపిణీ చేశారు. మిగతా భూమిని ఇతర గ్రామాలకు చెందిన వ్యక్తులు ఆక్రమించడంతో బాధితుడు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.

అధికారుల సూచనల మేరకు పోలీసుల సమక్షంలో జిరాయితీ భూమి కలిగిన హక్కుదారునికి హద్దులు వేసి స్వాధీన పరిచారు. కార్యక్రమంలో ఆర్ఐ విజయగణేష్, డీఎస్పీ ఎం.రాంబాబు, సీఐ చంద్రమౌళి, ఎస్సైలు అమ్మన్నరావు, మస్తాన్, అనిల్‌కుమార్, ఏఎస్సై సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో నేలతల్లి బాగు



నవధాన్యాల ప్రయోజనాలను వివరిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం: నవధాన్యాల సాగుతో నేలతల్లి బాగుంటుందని, నవధాన్యాలతో నేల సారవంతమై పంటలు బాగా పండుతాయని ప్రకృతి వ్యవసాయం మండల టీమ్ లీడర్ వై.గణేష్‌శరత్‌చంద్ర తెలిపారు. మండలంలోని ఇరిడి గ్రామ రైతు సేవా కేంద్రం వద్ద రైతులతో నవధాన్యాల కిట్లు గురువారం తయారు చేయించారు. ఖరీఫ్ వరి సాగుకు ముందు దుక్కి చేసుకుని, నేలలో నవధాన్యాలు వేసుకుని సాగు చేసుకోవాలన్నారు. ఇలా చేస్తే సూక్ష్మజీవులు వృద్ధి చెందడంతో పాటు నేల గుల్లబారడం, నీటి సంగ్రహణ శక్తి పెరగడం వంటివి జరిగి, వర్షాభావ పరిస్థితుల్లో పంటల సాగు బాగుంటుందన్నారు. కార్యక్రమంలో వీఏఏ ఎ.శివ తదితరులు పాల్గొన్నారు.

ఆహార భద్రతా అధికారుల తనిఖీలు



మామిడి పండ్ల వ్యాపారుల నుంచి శాంపిల్స్ సేకరిస్తున్న అధికారులు

పాలకొండ రూరల్: మామిడి పండ్లను వ్యాపారులు ప్రమాదకర రసాయనాలను వినియోగించి మగ్గబెడుతున్న విషయం తెలుసుకున్న ఆహార భద్రతా అధికారులు గురువారం పలుచోట్ల తనిఖీలు నిర్వహించారు. ఉదయం ఐదు గంటల సమయంలో వివిధ ప్రాంతాల నుంచి పాలకొండ ప్రధాన మార్కెట్‌కు బుట్టల్లో, పలు రకాల వాహనాల్లో తీసుకువస్తున్న మామిడి పండ్లను జిల్లా అధికారి రామయ్య నేతృత్వంలో సిబ్బంది పరిశీలించారు. పలు పండ్లను శాంపిల్స్‌గా సేకరించారు. కృత్రిమ విధానంలో పండించిన పండ్లను ఆరగించడం వల్ల కలిగే అనర్థాలపై ఈ సందర్భంగా అవగాహన కల్పించారు. సేకరించిన శాంపిల్స్‌ను హైదరాబాద్ ల్యాబ్‌కు పంపిస్తామని ఉద్యానవన అధికారి టి.అమరేశ్వరి తెలిపారు.

● పరామర్శ..



నగర పంచాయతీ పరిధిలోని ఎన్‌కే రాజపురం గ్రామానికి చెందిన గోగుల అప్పలనాయుడు కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జి తలే రాజేష్ గురువారం పరామర్శించారు. అప్పలనాయుడు భార్య గోగుల అప్పలనరసమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించారు. ఈ మేరకు ఆ కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. ఆయనతో పాటు కౌన్సిలర్ నీలాపు శ్రీనివాసరావు, నరేంద్ర, రామరాజు, రవికుమార్, తదితరులు ఉన్నారు.

– పాలకొండ

● సమ్మె విజయవంతం చేయండి..



కేంద్రం తీసుకువచ్చిన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 20న దేశవ్యాప్తంగా నిర్వహించనున్న సమ్మెను విజయవంతం చేయాలని రైస్‌మిల్లు వర్కర్స్ యూనియన్ నాయకుడు గేదల సత్యం కోరారు. ఈ మేరకు తుమరాడ గ్రామంలో గల రైస్ మిల్లు వద్ద కార్మికులతో కలసి సమ్మెకు సంబంధించిన కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు కాద రాము మాట్లాడుతూ.. రైస్‌మిల్లు కార్మికులకు 8 గంటల పని వేళలు నిర్దేశించాలన్నారు. పీఫ్, ఈఎస్ఐ, గ్రాడ్యుటీ, తదితర సౌకర్యాలు కల్పించాలని కోరారు. సమ్మెలో అన్ని రంగాలకు చెందిన కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

– పాలకొండ రూరల్

పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు తగదు..

వీరఘట్టం:



భామిని: బోనగడ్డి ధర్మారావు, వైస్ ఎంపీపీ

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు వేస్తోందని వైఎస్సార్‌సీపీ వీరఘట్టం పట్టణ నాయకులు అన్నారు. సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డి ఇంటిలో గురువారం నిబంధనలకు విరుద్ధంగా పోలీసులు తనిఖీలు చేపట్టడాన్ని వీరు ఖండించారు. ఈ మేరకు తహసీల్దార్ చందక సత్యనారాయణకు వినతిపత్రం ఇచ్చారు. సాక్షిపై జరుగుతున్న దాడులను ఆపాలని ప్రభుత్వాన్ని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో వైఎస్సార్‌సీపీ నాయకులు పిన్నింటి శ్రీనివాసరావు, అంబళ్ల రవి, శంభాన శ్రీనివాసరావు, పిన్నింటి దుర్గారావు, దేవుపల్లి ముద్దు, సాక్షి రిపోర్టర్ సింహాచలం, తదితరులున్నారు.

– పత్రికా రంగంపై దాడే..

భామిని: సాక్షి ఎడిటర్ ధనుంజయ రెడ్డి ఇంటిపై పోలీస్‌లు దాడి చేయడాన్ని పత్రికా రంగంపై దాడిగానే పరిగణించాలని వైస్ ఎంపీపీ బోనగడ్డి ధర్మారావు అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. ఈ దాడిని అన్ని వర్గాలూ ఖండించాలని పిలుపునిచ్చారు. రాజకీయ కక్షలతో వ్యక్తిగత దాడులు చేయించడం కూటమి ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు.



వీరఘట్టం: తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు